క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న దంత వైద్యులు

హొళగుంద: స్థానిక సిద్ధార్థ పాఠశాల కరెస్పాండెంట్ చిదానంద ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వైద్యులు మంగళవారం నిర్వహించిన శిబిరానికి మంచి స్పందన లభించింది. గ్రామ పెద్ద రాజ పంపన్నగౌడ్ శిబిరాన్ని ప్రారంభించగా దంత వైద్య నిపుణులు డాక్టర్ రఘుకుమార్, పూర్ణిమ, భాగ్యశ్రీ, జనరల్ సర్జన్లు కృష్ణ ప్రసాద్, జయశ్రీ వైద్య సేవలందించారు. 350 మందికి పైగా రోగులకు వైద్యసేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఆలూరు రూరల్: మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్టాటిస్టికల్ అసిస్టెంట్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించాలని ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి వినతి పత్రం అందించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించి సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జయరాం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గర్భిణులకు భోజన సదుపాయం

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి స్కానింగ్ పరీక్షల నిమిత్తం విచ్చేసిన గర్భిణులు, వారి సహాయకులు 300 మందికి మంగళవారం సేవాదళ్ ఆధ్వర్యంలో పి.మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ వైద్యులు హారిక, సుంకన్న గర్భిణులకు భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ సేవాదృక్పథం పట్ల గర్భిణులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు అనిత, సరోజ, వార్డు మెంబర్ నాగరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సెల్‌డౌన్

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు సెల్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ కార్యాలయం ముందు మున్సిపల్ ఉద్యోగ సంఘ నాయకులు నిరసన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

మద్దికెర: స్థానిక బస్టాండు వద్ద ప్రధాన కూడలిలో సర్పంచ్ సుహాసిని, ఎంపీడీఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు, ప్రజలు దాహంతో ఇబ్బంది పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, మాజీ సర్పంచ్ శాంతన్న, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనేయులు పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయండి

ఆలూరు రూరల్: గ్రామ/వార్డు సచివాలయాల సేవలు విస్తృతం చేయాలని ఆలూరు ఎంపీడీఓ అల్లబకాష్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సచివాలయం-2లో ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయాల సర్వీసులను వలంటీర్ల ద్వారా ప్రజలు తెలియజేయాలన్నారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు. ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్ మృతి



సుంకన్న (ఫైల్)

చిప్పగిరి: స్థానిక సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న సుంకన్న (50) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. సుంకన్న మృతి పట్ల జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, సర్పంచ్ గోవిందరాజులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల నిమిత్తం విరుపాక్షి రూ.5 వేలు, గ్రామ పంచాయతీ తరఫున పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రూ.5 వేలు ఆర్థిక సాయం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

వాహనాల వేలం

కృష్ణగిరి: వివిధ నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ద్విచక్ర వాహనాల వేలంపాటలో ఆయన పాల్గొన్నారు. గత రెండేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను వేలంవేయగా జీఎస్టీతో కలిపి రూ.69,527లకు అమ్ముడుపోయినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు వారు తెలియజేశారు.

ఆకస్మిక తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక సచివాలయం-2ను మంగళవారం ఎంపీడీఓ పార్థసారధి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘ఈ’-పోస్టాఫీసుతో విస్తృత సేవలు

- కార్పొరేటుకు ధీటుగా కార్యకలాపాలు
- ఉత్తమ సేవలకు గుర్తింపు



ఎమ్మిగనూరు పోస్టాఫీసు

ఎమ్మిగనూరు: శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు బ్యాంకింగ్ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోస్టల్ సేవలు విస్తృతమవుతున్నాయి. 170 ఏళ్ల భారతీయ పోస్టల్ రంగం ప్రస్తావనలో ఉత్తర, ప్రత్యుత్తరాలకే పరిమితం కాకుండా ఆన్‌లైన్, బీమా ప్రీమియం, సేవింగ్స్ బ్యాంక్, నేషనల్ సేవింగ్, ఆర్‌పీఎఫ్, ఎస్‌సీ ఎస్ఎస్, కిసాన్ వికాస్ వంటి పథకాలతో ప్రజలకు మరింత చేరువైంది. ఇంటర్నెట్ సేవలు,అంతర్జాతీయ నగదు మార్పిడిని కూడా తపాలా శాఖలో ప్రవేశ పెట్టడటం విశేషం. జిల్లాలో ఎమ్మిగనూరు పోస్టాఫీసు ప్రత్యేక గుర్తింపు సాధించింది. తపాలా శాఖ పరిధిలో రెండు పర్యాయాలు ఉత్తమ పురస్కారాలు, అవార్డులు సొంతం చేసుకుంది.

బ్యాంకులకు ధీటుగా..

తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎమ్మిగనూరులో ఉంది. ఇక్కడ కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా 11 వేల బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ప్రధాన పోస్టాఫీసుకు అనుబంధంగా 15 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. నందవరం, గుడేకల్, బనవాసి, తేరుబజారు, నాగలదిన్నె, ముగతి, కడివెళ్ల తదితర గ్రామాల్లో మొత్తం 15 సబ్ పోస్టాఫీసుల్లో విస్తృత సేవలందిస్తున్నాయి. సామాన్య ప్రజలకు సేవలందించటంతోపాటు కార్పొరేట్ రంగానికి సవాల్ విసురుతూ తపాలా సేవలు విస్తరిస్తున్నాయి. ఎమ్మిగనూరు ప్రధాన పోస్టాఫీసులో 2017-18, 2018-19 సంవత్సరాల్లో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా బాలికలకు అధిక సంఖ్యలో ఖాతాలు తెరిచి భరోసాగా నిలిచింది. ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యుత్తమ సేవలకుగాను రెండు పర్యాయాలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంది.

విస్తృత సేవలు

ఎమ్మిగనూరు మెయిన్ పోస్టాఫీసులో సేవింగ్స్ అకౌంట్లు 4,500, ఆర్‌డీ అకౌంట్లు 4,500, బాలికల కోసం ఎస్ఎస్ఏ అకౌంట్లు 2000 చొప్పున మొత్తం 11 వేలకు పైగా బ్యాంక్ ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతా, నెలసరి ఆదాయ పథకం ఖాతాదారులకు ప్రమాద జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. అలాగే ఇతరులు బీమా చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల వారికి గ్రామీణ తపాలా జీవిత బీమా సౌకర్యాన్ని ప్రత్యేకంగా కల్పిస్తున్నారు. రూ.లక్ష బీమా చేసిన వారు ఇతర బీమా కంపెనీలకన్నా అధికంగా సంవత్సరానికి రూ.5 వేల బోనస్‌ను పొందవచ్చు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలాబీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షబీమా యోజనతో పాటు గతం నుంచి అమలులో ఉన్న బీమా పథకాలను తపాలా శాఖ చేపడుతోంది.

పౌర సేవలు: పౌరుల ఆధార్ నమోదుతోపాటు, తప్పొప్పులు సరిచేసేందుకు ఆధార్ సెంటర్‌ను కూడా పోస్టాఫీసుకు కేటాయించారు. ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఆధార్ సేవలను నిత్యం వినియోగించుకుంటున్నారు. విదేశీ ప్రయాణాలకు అవసరమైన పాస్‌పోర్టు సౌకర్యాలను తపాలా శాఖ నిర్వహిస్తోంది. ఎమ్మిగనూరు బ్రాంచ్‌లో అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయి. సర్వీసులు ఆదోని, కర్నూలు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నాయి. తిరుమల, తిరుపతి దేవస్థానంకు చెందిన రూ.300 దర్శన టికెట్లను పోస్టాఫీసు ద్వారా బుక్ చేసుకోవచ్చు. అదేవిధంగా పుష్కరాలకు చెందిన తీర్థాలు, పుష్కర జలాలను తపాలాశాఖ ద్వారా పొందవచ్చు.

ఇతర సేవలు

‘పికప్ మెయిల్స్ త్రూ పోస్ట్‌మ్యాన్’ ద్వారా తపాలా సేవల్లో భాగమైన పోస్టుకార్డులు, కవర్లు, స్టాంపులు వంటి వాటిని పోస్టుమ్యాన్ మన ఇంటి వద్దకే వచ్చి విక్రయిస్తారు. ఏదైనా కార్యాలయం, షోరూమ్ తదితరాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలు, కరపత్రాలను ఇంటింటికి పంపవలసి వచ్చినప్పుడు పోస్టుమ్యాన్ వీటిని డైరెక్టు పోస్టు ద్వారా చేరవేస్తాడు. ఏదైనా గృహోపకరణాలు, బియ్యం బస్తాలు, ఇతర వస్తువులను మనకు కావాలసిన చోటికి చేరవేసేందుకు తపాలా శాఖ లాజిస్టిక్ పథకాన్ని ప్రారంభించింది. సామానుల ప్యాకింగ్ దగ్గరి నుంచి రవాణా, డెలివరీ వరకూ అన్నీ శాఖ సిబ్బందే బాధ్యత వహిస్తారు. ఈఎంఎస్ స్పీడ్ పోస్టు ద్వారా మనకు చెందిన సమాచారాన్ని లేదా వస్తువులను 104 దేశాల్లోని వారికి పంపే వెసులుబాటు ఉంది.

సేవా సంస్థగా భావిస్తున్నాం

తపాలా శాఖను ఓ సేవా సంస్థగా భావిస్తూ ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ శాఖకు పూర్వ వైభవం తీసుకువచ్చి ప్రతిఒక్కరి అభిమానాన్ని చూరగొనేందుకే ‘ఆమ్ ఆద్మీ పోస్టు’ అనే కొత్త నినాదంతో 2009లో ఆధునీకరించారు. 2014 నుంచి ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయి.

ఎండీ గోపాల్, ఇన్‌చార్జి పోస్టుమాస్టర్

178 మందికి ఈబీసీ నేస్తం

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి 178 మందికి ఈబీసీ నేస్తం పథకం మంజూరైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు చెప్పారు. బురుజులలో 18, హంప-24, ఎం.అగ్రహారం-36, పెరవలి-48, మద్దికెర-52 చొప్పున సాయం మంజూరైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం డీబీటీ ద్వారా ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు.

కుంభాల ఊరేగింపు

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో లింగమేశ్వర స్వామి ఉత్సవాల సదర్భంగా మంగళవారం స్వామి వారికి భక్తులు కుంభాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సచివాలయం ముందు నిర్మాణాలు వద్దు

మద్దికెర: మద్దికెరలోని బస్టాండు వద్ద ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం ముందు గదుల నిర్మాణాలు చేపట్టవద్దని సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులుకు నాగేష్‌తో పాటు మరికొంత మంది మంగళవారం తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇతర భవనాలు నిర్మించడం వల్ల భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు మాట్లాడుతూ.. పంచాయతీకి ఆదాయ వనరులు పెంచేందుకు పాలకవర్గం అనుమతి మేరకు గదుల నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు. మరోసారి సమావేశం నిర్వహించి నిర్మాణాలపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా పనిచేయండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మిదేవి

ఆలూరు: ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలే తప్పా ఎక్కడా నోరు జారవద్దని, ఇష్టం లేని అధికారులు బదిలీ చేయించుకుని వెళ్లిపోవాలని ఎంపీపీ లక్ష్మిదేవి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, ఉపాధి పథకం పనుల కల్పన, జగనన్న గృహాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన ప్రజలు, రైతులు, విద్యార్థులు అధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతులు, ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేయడం దారుణమన్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకాకపోవడాన్ని తప్పుబట్టారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలు ఇస్తాయన్నారు. పొట్లపాడు గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలకు ఇప్పటివరకు బిల్లులను మంజూరు చేయలేదని సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి, ముస్లింల శ్మశానవాటికకు స్థలం మంజూరు చేయాలని ఐరన్‌బండ సర్పంచ్ భాగ్యమ్మ, తాగునీరు, సీసీ రోడ్లు మంజూరు చేయాలని కొత్తపేట సర్పంచ్ షేకమ్మ, సర్పంచ్ మాదక్క, ఎంపీటీసీ శ్రీనివాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఏఓ సురేష్‌బాబు, పీఆర్ ఏఈ రంగస్వామి, ఎంఈఓ రంగస్వామి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘జీజీఎంపీ’



జొన్నగిరిలో సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం జొన్నగిరిలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారుంటే వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి మెయిన్ రోడ్డు వేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే నడవడానికి కూడా వీల్లేకుండా రోడ్డంతా బురదమయంగా మారుతుందని మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జొన్నగిరి నుంచి పెండేకల్లు ఆర్ఎస్ వరకు బీటీ రోడ్డు మంజూరైందని భూమి పూజ కూడా చేశామన్నారు. సాంకేతిక కారణాలతో పనులు ఆలస్యమయ్యాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తప్పనిసరిగా రోడ్డు వేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతోందని, ఇది గిట్టని టీడీపీ విష ప్రచారం చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగేష్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైఎస్ నాగప్ప, భాస్కరరెడ్డి, దేవి, రఘు, సోమశేఖరరెడ్డి, తేరప్ప, పక్కీరప్ప, సుంకప్ప, ప్రకాష్, దివాకర్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే



పూలే చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్, కేఎస్ రఘు

ఆలూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అంటరాని తనాన్ని రూపుమాపడానికి ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి కార్యాలయంలో మంగళవారం పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, మహిళలకు విద్యను చేరువ చేసేందుకు పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, వీరేష్, హనుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: మహాత్మా జ్యోతిరావ్ పూలే అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా కార్యదర్శి లలిత రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పూలే చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను కొనియాడారు.

జనం నోట జగన్నినాదం



నందవరంలో ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

నందవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. నందవరం మూడవ వార్డులో ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. 7వ వార్డులో ఉన్న కణిగిరి రామన్న, లక్ష్మీదేవి, ఖాజాబీ, చాంద్‌బీ, జరీనాబీ, మాబున్ బీ తదితరుల ఇళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు ఇలాగే కొనసాగాలని, మరోమారు జగనన్నను గెలిపించుకుంటామని వారు తెల్చిచెప్పారు. జగనన్నే మా నమ్మకమని, పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపారని ఖాజాబీ ఆనందం వ్యక్తం చేస్తూ స్వయంగా జగనన్న స్టిక్కర్‌ను ఇంటికి అతికించుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ, సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షిరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, తోట సావిత్రి, తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని ప్రతి ఇంటా కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి పలు కుటుంబాల వారితో మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. వార్డు కౌన్సిలర్ బంగి ప్రమీళ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగిశ్రీరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, తదితరులు ఉన్నారు.

కృష్ణగిరి: మాలాంటి పేదలకు అండగా ఉంటున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని అమకతాడు ఎస్సీ కాలనీకి చెందిన మాదిగ వెంకటరమణమ్మ అన్నారు. మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు బాలు, మహేశ్వరరెడ్డి, శేఖర్, ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాల తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వెంకటరమణమ్మ ఇంటికి వెళ్లి కరపత్రాలు అందించగా జగనన్న స్టిక్కర్‌ను అడిగి ఇప్పించుకుని ఇంటి గోడకు అతికించుకున్నారు. నాలుగేళ్లుగా తమ కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరిందని, జగనన్నకు రుణపడి ఉంటామని ఆమె ముక్తకంఠంతో వెల్లడించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, జయరామిరెడ్డి, యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి, గిడ్డయ్య, భీమిరెడ్డి, శంకరయ్య, సుదర్శనాచారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల పరిధిలోని మద్దిలింగదహళ్లి, మార్లమడికి, నెరణికి, లింగంపల్లి, కోగిలతోట, హొళగుంద తదితర గ్రామాలలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమం చేపట్టారు. నాయకులు రంగస్వామి, శంకర్, చంద్ర, మౌనేష్, తిక్కన్న తదితరులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి తిరిగారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరిస్తూ వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండండి



ఎండకు పగిలిన కొండరాయిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీలోని నరసప్ప దేవాలయం వద్ద భారీ కొండరాయి ఎండ వేడిమికి రెండుగా చీలడంతో ఆ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం కొండరాయి రెండుగా చీలిన విషయం తెలిసిందే. మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎంపీపీ టీ.నసురుద్దీన్‌తో కలిసి కొండరాయిని పరిశీలించారు. ఘటనపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పగిలిన కొండరాయి ప్రమాదకరంగా ఉందని, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునే వరకు కొండ పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చీలిన కొండను వీలైనంత త్వరగా తొలగించాలని అక్కడకు వచ్చిన మైనింగ్ అధికారులకు సూచించారు. నాయకులు ఎస్‌బీ మన్సూర్, కాశీరెడ్డి, ఉన్నారు.

‘వాత్సల్య’ గడువు పెంచాలి

వెల్దుర్తి: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ‘మిషన్ వాత్సల్య’ పథకానికి ఈనెల 15వ తేదీ వరకు ఉన్న గడువును పొడిగించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలిత డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె ఓ ప్రకటనలో.. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్, బర్త్, స్టడీ సర్టిఫికెట్లతోపాటు బ్యాంకు ఖాతాలు వ్యక్తిగతంగాను, జాయింట్ పద్ధతిలోనూ సేకరించేందుకు సమయం పడుతోందని పేర్కొన్నారు. సమస్యలను గుర్తించి దరఖాస్తు గడువు పొడిగించాలని కోరారు.

మట్టి తొలగింపునకు చర్యలు

పత్తికొండ రూరల్: స్థానిక షాదిఖానా వెనుకభాగంలో కడుగొమ్ము తూముకు పూడ్చిన మట్టిని తొలగించి చదును చేసేందుకు మంగళవారం మైనర్ ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్, ఏఈ వేణుగోపాల్, ఎస్ఐ గోపాల్ సమక్షంలో జేసీబీతో పనులు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం కడగొమ్మును మట్టితో పూడ్చివేసిన విషయాన్ని స్థానిక ముస్లింలు, రైతులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆర్డీఓ మోహన్‌దాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువు ప్రాంతాన్ని పరిశీలించి కడగొమ్ము పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆక్రమణదారులు షెడ్డు నిర్మించేందుకు పూనుకోగా విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు నిర్మాణాలను నిలిపివేసి, మట్టి తొలగింపు పనులను శరవేగంగా పూర్తి చేయించారు. సదరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆక్రమణదారులను అధికారులు హెచ్చరించారు.

సారా బట్టీలపై దాడులు

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ తండా శివారు కొండ ప్రాంతాలలో నాటుసారా స్థావరాలపై మంగళవారం కోడుమూరు సెబ్, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పలు స్థావరాల వద్ద నిల్వ ఉంచిన 14 బిందెల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు, బట్టీ నిర్వాహకులెవరన్నది విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలుషిత నీరు సరఫరా



రంగుమారిన నీరు

హొళగుంద: మండల కేంద్రంలోని కొన్ని వీధుల్లో కుళాయిలకు సరఫరా అయ్యే నీరు మలినాలతో కలిసి దుర్గంధం వస్తుండడంతో కాలనీవాసులు ఇదేం నీరు బాబోయ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమవుతోందని వాపోతున్నారు. కొండపై ఉన్న ట్యాంకు నుంచి గ్రామంలోకి నీటిని సరఫరా చేసేందుకు వేసిన పైప్‌లైన్ పెంటదిబ్బలు, చెత్త చెదారం ఉన్న ప్రాంతంలో ఉందని, లీకేజీ ఏర్పడి పైపుల్లోకి కలుషిత నీరు చేరుతోందన్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యాచకుడి డబ్బుపై విచారణ చేస్తాం



అనారోగ్యానికి గురైన యాచకుడు షరీఫ్

హొళగుంద: ఎల్లార్తిలో యాచకుడి డబ్బు విషయంలో తహసీల్దారుతో విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్ఐ అబ్దుల్‌జహీర్ అన్నారు. ఎల్లార్తి దర్గాలో దాదాపు 25 ఏళ్లుగా ఉంటున్న షరీఫ్ అనే యాచకుడు వృద్ధాప్య సమస్యతో రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దర్గాలోని కొందరు అతనికి సపర్యలు చేయగా భిక్షాటన ద్వారా పోగుచేసిన సొమ్ము రూ.2.90 లక్షలను గుర్తించి వాటిని తమ వద్ద పెట్టుకున్నారు. సొమ్ము విషయంపై పుకార్లు వ్యాపించడంతో మంగళవారం ఎస్ఐ అబ్దుల్‌జహీర్ వారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. సొమ్ము భద్రంగా ఉంచాలని సూచించారు. ఘటనపై బుధవారం తహసీల్దారుతో కలిసి విచారణ జరిపి యాచకుడికి డబ్బు చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తగిన చికిత్స చేయించి అనాథాశ్రమం లేదా బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.